క్లుప్తంగా

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాయచోటి, చెన్నూరు ఘటనల నేపథ్యంలో 'మతసామరస్యం-ప్రాధాన్యత' అనే అంశంపై శనివారం నగరంలోని నూర్జహాన్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశంను జయప్రదం చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సిద్ధిరామయ్య, జిల్లా నాయకులు షేక్ మక్బూల్ బాషా, ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష కార్యదర్శులను ప్రజా సంఘాల క్రిస్టియన్ మైనార్టీ సంఘాల నాయకులను కూడా పిలిచామన్నారు. మనందరం ఐక్యంగా జిల్లాలో మతసామరస్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని భావించి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజయనగరం జిల్లా, వేపాడ మండలం, గుడివాడ గ్రామంలోని వేణుగోపాల స్వామి తీర్థం వద్ద విధుల్లో ఉన్న పోలీసు అధికారి దేవి ని యువకులు దూషించడం, విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారిని జుట్టు పట్టుకొని పక్కకు లాగేసి , దుర్భాషలాడుతూ దాడి చేశారన్నారు. ఆమె భయంతో పక్కనే ఉన్న ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారన్నారు. పోలీస్ వ్యవస్థలో మహిళలకు కూడా రక్షణ లేని దుస్థితి నెలకొందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలకు అర్థమవుతోందన్నారు. కమలాపురంలో గురువారం లక్ష్మీదేవి అనే మహిళపై దుండగుడు దాడి చేసి బంగారు ఆభరణాలు లూటీ చేశారన్నారు. కడప బాలాజీ నగర్ కి చెందిన మాధవి(55) ఆచూకీ తెలియలేదన్నారు. మహిళలపై దాడులు, హత్యలు, మిస్సింగ్ కేసులు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు.

జాతీయ మహాసభలు జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నరేంద్ర, సుబ్బారాయుడు

కడప ఎడ్యుకేషన్: కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో మే 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రగతిశీల విద్యార్థి సంఘం నాలుగో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, సుబ్బారాయుడు కోరారు. జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని శుక్రవారం కడపలోని కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన జాతీయ విద్యా విధానం ఏకపక్షంగా అమలు చేస్తోందన్నారు. దేశంలోని ప్రభుత్వ ఆస్తిని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మేస్తోందన్నారు. ఇలాంటి నేపథ్యంలో బీజేపీ నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని విద్యార్థి, యువతపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపు అయ్యన్న, రాంచరణ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు



బంజారా హోలీ సంబరాల్లో నృత్యాలు చేస్తున్న మహిళలు

కడప రూరల్: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గిరిజన భవన్‌లో ఘనంగా హోలీ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఏటా బంజారా కుటుంబాలు సాంప్రదాయకంగా హోలీ సంబరాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని తెలిపారు. రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ అరుణ్‌నాయక్ మాట్లాడుతూ బంజారాలు అన్ని రంగాల్లో ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్ సురేష్‌బాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ నాయక్, కోశాధికారి డాక్టర్ శివానాయక్, జిల్లా అధ్యక్షులు జగన్ రాథోడ్, వేణుగోపాల్ నాయక్, రామ్మూర్తినాయక్, వెంకటస్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన రాజస్తానీ సమాజ్ సభ్యులు శుక్రవారం హోలీ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. కడప నగర పరిధిలోని పాలెంపల్లెలోగల వారి రిసార్ట్స్‌లో ఉదయం 10 గంటలనుంచి ఉత్సవాలను మొదలు పెట్టారు. మధ్యాహ్నం 2 గంటల వరకు నిరంతరాయంగా రంగుపొడులు, రంగునీళ్లు ఒకరిపై ఒకరు చల్లుకుంటూ ఆనందించారు. వారిలో కొందరు సంప్రదాయంగా డోలు వాయిస్తూ నృత్యాలు చేస్తుండగా, మరికొందరు కర్రలు చేతబూని రాజస్తానీ సుప్రసిద్ధ నృత్యమైన దాండియా ఆడి ఆనందించారు. ఈ నృత్యాలలో కార్యక్రమానికి హాజరైన రాజస్తానీలందరూ ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో గణపతిరాజ్ చౌదరి, మనోహర్ సింగ్, శంభోసింగ్, రమేష్ చౌదరి, అమృత చౌదరి, ఎరికలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: హోలీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం పిల్లలంతా ఉల్లాసంగా రంగులు చల్లుకున్నారు. కడప నగరంలోని భాగ్యనగర్‌కాలనీలో పిల్లలంతా రంగులు చల్లుకుంటూ ఎంజాయ్ చేశారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివార్లలోని 18వ డివిజన్ పరిధిలోని ఏఎల్ కాలనీలో శుక్రవారం ఘనంగా హోలీ వేడుకలను నిర్వహించారు. బంజారా సేవాలాల్ సంఘం వ్యవస్థాపకుడు అంజినాయక్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలను కాలనీ వాసులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఘనంగా జరుపుకున్నారు. అదే విధంగా గ్రామంలోని తమ కుల దేవతకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోనికుమార్ నాయక్, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ నాయక్, సలహాదారుడు అప్పానాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్ నాయక్, ట్రెజరర్ ఈశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


రంగులు చల్లుకుంటున్న చిన్నారులు


నగర శివార్లలో హోలీ సంబరాల్లో రాజస్తానీ సమాజ్ ప్రతినిధులు, యువకులు


మేయర్ సురేష్‌బాబును సన్మానిస్తున్న బంజారా సంఘం నేతలు

పౌర్ణమి పూజలు


కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీవిజయదుర్గమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారు జామున పుణ్యనదీ జలాలు నింపిన తొమ్మిది పవిత్ర కళశాలతో తొమ్మిది మంది దంపతులు నవకలశస్నపనం నిర్వహించారు. తొలుత ఈ కలశాలతో వారు భక్తులతో కలిసి ఆలయం చుట్టూ వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ మూడు ప్రదక్షణలు చేసి ఆ పవిత్ర కలశాలను అర్చకులకు అందజేశారు. వారు ఆ నీటితో అమ్మవారి మూలమూర్తికి నవకలశస్నపనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పౌర్ణమి పూజల్లో భాగంగా సాయంత్రం 108 దీపాలతో 108 మంది ముత్తైదువులు అష్టోత్తర దీపాలంకార సేవ చేశారు. రాత్రి అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు.

పొంచి ఉన్న ప్రమాదం



కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని జడ్పీ నుంచి కోటిరెడ్డి సర్కిల్ వైపు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో సమస్య పొంచి ఉన్నా సంబంధింత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండా దేశాభివృద్ధి అసాధ్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశంలో ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండా అభివృద్ధి అసాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిరుద్యోగ వ్యతిరేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు భారత దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు, టీచర్, సైన్యం ఉద్యోగాలు మినహా మిగతా అన్ని ప్రభుత్వ శాఖలలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగాలు మాత్రమే ఇస్తున్నారని, పర్మినెంట్ ఉద్యోగాలు కనుమరుగు చేశారని విమర్శించారు. 2017 నుండి ×మేక్ ఇన్ ఇండియా నినాదం నరేంద్ర మోడీ అమలు చేస్తానని, 2014 ఎన్నికల ముందు దేశవ్యాప్తంగా జరిగిన బహిరంగ సభల్లో దేశ ప్రజలకు నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. 2019 ఎన్నికల ముందు మేక్ ఇన్ ఇండియా నినాదం ఇచ్చి మరొకసారి దేశ యువతను మభ్య పెట్టారని ఆచరణలో అది బూటకమని తేలిందన్నారు. కొన్ని సినిమాలు, అశ్లీల ఇంటర్నెట్ యువతను తప్పుదారి పట్టిస్తున్నాయని, సందేశాత్మకమైన సినిమాలు సెన్సార్ బోర్డు విస్మరించిందని, ప్రభుత్వాలు పాలకులు కూడా ఇలాంటి విష సంస్కృతిని అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఈ సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు ఐ.ఎన్.సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసు రెడ్డి, రామ్మోహన్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చిన్ని, వి.శివ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.రాహుల్, రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

హామీలను వెంటనే అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతిని ప్రకటిస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే పెండింగ్ బకాయిలన్నింటినీ చెల్లిస్తామని, డీఏలను సకాలంలో ప్రకటిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి తొమ్మిది నెలలు పూర్తయినా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. 2023 జులై నుంచే ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలులోకి రావాల్సి ఉండగా, కార్యరూపం దాల్చలేదన్నారు. ఉద్యోగుల ఆర్థిక సమస్యలను పరిష్కరించక పోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లాఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి మునివర్దన్ కుమార్ , జిల్లా కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బాధ్యత ఇక ప్రజలదే

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రస్తుతం అధికారుల సమావేశాలను చూస్తుంటే విద్యాశాఖకు ప్రమాదకర పరిస్థితులు దాపురించాయని, ఇక ప్రభుత్వ పాఠశాలల బాధ్యత ప్రజలే చూసుకోవాలని ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి అన్నారు. కడపలోని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ బడులకు ప్రమాద గడియలు మోగుతున్నాయని అన్నారు. అలా జరిగితే పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ప్రభుత్వ విద్యకు దూరమవుతారన్నారు. జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ మోడల్ స్కూల్ పేరుతో దగ్గరలోని 5 కిలో మీటర్ల పరిధిలో అని ఒకసారి మరోసారి 7 కిలో మీటర్ల దూరంలో గల ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను మోడల్ స్కూల్లో విలీనం చేస్తామని చెబుతున్నారన్నారు. వీటన్నింటినీ చూస్తుంటే పల్లె బడి కనుమరుగయ్యేటట్టు ఉందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ బలికాబోతున్న గ్రామ బడులను కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు. వారిలో చైతన్యం తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దిలీప్‌కుమార్, రామలక్ష్మిరెడ్డి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఎస్‌టియూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి

వేదాంత ఆసుపత్రి ప్రారంభం


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ క్రాంతికుమార్ తదితరులు

కడప రూరల్/ కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగరంలోని అక్కాయపల్లె పార్కు వద్ద అత్యాధునిక వైద్య సౌకర్యాలతో ఏర్పాటు చేసిన వేదాంత ఆసుపత్రిని వైద్యుల తల్లిదండ్రులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ఎస్ క్రాంతికుమార్, ఎస్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఎన్ దినేష్‌కుమార్‌రెడ్డి, పీ శివశంకర్, కే అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక వైద్య సౌకర్యాలతో 100 పడకలు గల ఆసుపత్రిని ఏర్పాటు చేశామని తెలిపారు. న్యూరో సర్జరీ, కార్డియాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, ఫిజియోథెరపీ తదితర వైద్య సేవలను పొందవచ్చన్నారు. అత్యవసర వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మేయర్ సురేష్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్ బాష, పులివెందుల మున్సిపల్ వైస్ ఛైర్మెన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, డింబర్ డిపో శ్రీనివాసులుతో పాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స ఆదర్శప్రాయుడు



కారల్‌మార్క్స చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కారల్ మార్క్స రచించిన రచనలు అద్భుతమని, ఆయన స్ఫూర్తిదాయక వ్యక్తి అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో కారల్ మార్క్స 142వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దోపిడీకి వ్యతిరేకంగా, అన్యాయాలకు వ్యతిరేకంగా హక్కుల కోసం పోరాడుతున్న వారందరికీ మార్క్స ఆదర్శమని, ఆయన స్ఫూర్తితోనే పోరాటాలు నిర్వహిస్తున్నారని విజయాలు సాధిస్తున్నారని, ప్రజలకు వెన్నుదన్నుగా కమ్యూనిస్టులు పోరాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వైయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధరామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి మక్బూల్ బాషా, మడగలం ప్రసాద్, విజయ్ కుమార్, మునిరెడ్డి, వినోద్, అజయ్, సుబ్బయ్య, సిద్ధా తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం


మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం


కడప కార్పొరేషన్ : ఆర్టీసీ బస్టాండు-అంబేడ్కర్ విగ్రహం మార్గంలో మ్యాన్‌హోల్ దుస్థితిపై 'పొంచి ఉన్న ముప్పు' అనే శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితమైంది. మున్సిపల్ అధికారులు స్పందించారు. దానికి మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

పుష్పగిరిలో గిరి ప్రదక్షిణ


గోపూజతో గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ ఏసీ మల్లికార్జునప్రసాద్

వల్లూరు : పుష్పగిరిలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిల చేతుల మీదుగా ఆలయ ప్రాంగణంలో గోపూజను నిర్వహించి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. భక్తులకు మజ్జిగతో పాటు ప్రసాద వితరణ చేశారు. అనంతరం చెన్నకేశవ స్వామి ఆలయంలో నూతనంగా గిరి ప్రదక్షిణ కమిటీ ఏర్పాటు చేశారు. ఇక ప్రతి పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణ కార్యక్రమం గోపూజ కార్యక్రమంతో ప్రారంభమవుతుందని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమం సంపూర్ణంగా దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అనువంశిక ధర్మకర్త సమక్షంలో గ్రామ సేవా సభ్యులు, సేవా కమిటీ సభ్యుల సహాయ సహకారంతో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉచిత వాహన సదుపాయం ఏర్పాటు చేసిన బసిరెడ్డి, అర్చకులు సుమంత్ దీక్షిత్, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రైస్తవుల తపస్కాలం



కడప కల్చరల్ : దైవం సూచించిన మార్గంలో ఖచ్చితంగా పయనించే తపస్కాలం ప్రారంభమైంది. ఈనెల 5వ తేది నుంచి ఈ పవిత్ర గడియలు, పవిత్రమైన రోజులు ప్రారంభమైనట్లు క్రైస్తవ విశ్వాసులు తెలుపుతున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఈనెల 5 నుంచి తపస్కాల ఉపవాసాలను ప్రారంభించారు. ఏప్రిల్ 18వ తేది గుడ్‌ఫ్రైడే, ఆ మరుసటిరోజు శనివారం వరకు లెంట్ డేస్ (తపస్కాలాన్ని...దుఃఖ దినాలు) భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా దానధర్మాలు చేస్తూ విలాసాలకు దూరంగా ఉంటూ నిరంతర ప్రార్థనలతో దేవునికి దగ్గరయ్యేందుకు విశ్వాసులు కృషి చేస్తారు. క్రైస్తవ గురువుల బోధనల ప్రకారం క్రీస్తును విశ్వసించే వారు ఆయన పాపుల రక్షణ కోసం పడిన కష్టాలను గుర్తు చేసుకుంటారు. అదే విశ్వాసులను నిత్య జీవంవైపు నడుపుతుందని పెద్దలు బోధిస్తున్నారు.

మనలను ద్వేషించే వారిని ప్రేమించాలన్న క్రీస్తు వ్యాఖ్యాన్ని గుర్తు చేసుకుంటూ, ఉపవాసాలు ఆచరిస్తూ ఉన్న దానిలో ఇతరులకు పంచడం ద్వారా మోక్షం లభించగలదని క్రైస్తవ లోకం విశ్వసిస్తుంది. కనుక

ఈ తపస్కాలమంతా జిల్లాలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థన కూడికలు నిర్వహిస్తారు. క్రైస్తవ సేవా సంస్థలు పలు చర్చిలలో వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు, శుభ శుక్రవారం రోజున రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ 40 రోజుల్లో విశ్వాసులు మద్యం, మాంసం జోలికి వెళ్లరు. ఎలాంటి శుభకార్యాలు నిర్వహించరు. వీలైనంత వరకు దేవుని ధ్యానంలో గడుపుతారు. ఉదయం నుంచి ఉపవాసం ఉంటూ కేవలం రోజుకు ఒక్కపూట మాత్రమే అది కూడా రాత్రి ప్రార్థనలనంతరం మాత్రమే ఆహారం స్వీకరిస్తారు. మధ్యలో అవసరమైనపుడు మంచినీరు సేవిస్తారు. మళ్లీ మరుసటిరోజు రాత్రి మాత్రమే భోజనం చేస్తారు. ఈ పుణ్యకాలంలో విశ్వాసులంతా ఈ సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 18న గుడ్‌ఫ్రైడే నాడు శిలువయాగం తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు.

పథకాల అమలులో జగనన్నే టాప్



మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సంక్షేమ పథకాల అమలులో జగనన్నే టాప్ అని, ప్రపంచంలోనే జగనన్న పేరు లిఖించబడిందని కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ప్రవేశ పెట్టినన్ని సంక్షేమ పథకాలు, ఏ రాష్ట్రం గాని, ఏ దేశం గాని అమలు చేయలేదన్నారు. దీంతో జగనన్న పేరు ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందన్నారు. భవిష్యత్‌లో మళ్లీ విజయం సాధించి చరిత్ర సృష్టిస్తామన్నారు. ప్రస్తుత కూటమి నేతలు, ప్రభుత్వ పెద్దల దోపిడీలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు రాజ్యమేలుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి, ఇసుక, మద్యం, భూ కబ్జాలు, లేఔట్లు ఏదీ వదలడం లేదని ధ్వజమెత్తారు. 9 నెలల్లోనే ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని త్వరలో తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన పునరుద్ఘాటించారు. విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక ఫోకస్ పెట్టి పాలన సాగించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అలాగే రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు, ఎయిర్ పోర్టులు నిర్మించి అనేక మందికి ఉపాధి కల్పించారని, అది సంపద సృష్టి అన్నారు. రైతులకు ప్రతి దశలో సాయం చేయడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం కల్పించి రైతులకు ఆదాయం చేకూర్చిన ఘనత జగనన్నదేనని, ఇది సంపద సృష్టి అన్నారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి, ఇపుడేమో చెవిలో చెప్పాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

నా తనయుడికి మద్దతివ్వండి:

2014, 2019 ఎన్నికల్లో తనకు మద్దతిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞుడనని, 2029 ఎన్నికల్లో తన వారసుడు నరేన్ రామాంజులరెడ్డికి మద్దతిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి తెలిపారు. నరేన్‌ను నియోజకవర్గ కార్యకర్తలకు సభాముఖంగా పరిచయం చేసి తనకు ఇచ్చిన సహకారమే తన కుమారుడికి కూడా ఇవ్వాలని ఆయన కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత జగనన్నదే..

2019 ఎన్నికల్లో నేను చూసాను.. నేను విన్నాను... నేను ఉన్నాను.. అనే ఒకే వాక్యంతో జగనన్న ఎన్నికల ప్రచారం నిర్వహించి అధికారంలోకి వచ్చారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. జగనన్న తన పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలతో మెనిఫెస్టో తయారు చేసి దానిని 99 శాతం అమలు చేశారన్నారు. కూటమి నేతలు సూపర్ సిక్స్‌లో కేవలం రెండు పథకాలకు మాత్రమే కేటాయింపులు చేశారని, అవి కూడా అరకొర మాత్రమేనన్నారు. ఈ సమావేశంలో మండలాల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, రఘునాథరెడ్డి, వీరారెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, మహిళా అధ్యక్షురాలు తెలుగుపులి వెంకటసుబ్బమ్మ, ఎంపీపీ చీర్ల సురేష్, సీకే దిన్నె శ్రీనివాసురెడ్డి, వివిధ అనుబంధాల జిల్లా అధ్యక్షులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, శివరామక్రిష్ణ, రాఘవరెడ్డి, సూర్య నారాయణ, రాజు బాషా తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజపాళెం సుబ్బారెడ్డి, గంగాధర్ రెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, చెన్నకేశవరెడ్డి, శివ సుబ్రమణ్యం, మూలె సరస్వతి తదితరులు పాల్గొన్నారు.